క్లుప్తంగా

మాన్యం కౌలుకు వేలం


ఆలమూరులో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఆలమూరు ఈశ్వర, చెన్నకేశవ స్వామి వారి ఆలయాల మాన్యం కౌలుకు దేవదాయ శాఖ ఈఓ సాయి జయచంద్రారెడ్డి సోమవారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన 25 మంది రైతులు డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రెండు ఆలయాలకు కలిపి 48.13 ఎకరాల భూమి ఉందని, వేలంలో రూ.12.50 లక్షలు వచ్చిందని ఈఓ తెలిపారు. గతేడాది రూ.9లక్షలు రాగా ఈ ఏడాది అదనంగా రూ.3.50 లక్షలు వచ్చినట్లు చెప్పారు. ఆలయ ధర్మకర్త శూలం ప్రభాకర్, రైతులు పాణ్యం చంద్ర,నాగేష్,సుబ్బారావు,బాలయ్య ఉన్నారు.

కేడీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ మృతి

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ కేడీసీసీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పశువుల ఓబులేస్ (56) సోమవారం మృతి చెందారు. బంధువులు, సహచర ఉద్యోగులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన ఓబులేస్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు వైద్యశాలల్లో చికిత్సలు పొందారు. కోలుకోలేక స్వగ్రామంలోనే ఇంటి వద్ద మృతి చెందారు. ఇతనికి భార్య ఓబులమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతి పట్ల ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, బోడ్మెనూరు సొసైటీ సీఈఓలు మౌలాలి, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

యాళ్లూరులో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ సహకారంతో గ్రామంలో స్వచ్ఛందంగా పలువురు సోమవారం రక్తదానం చేశారు. యాళ్లూరులోని ఆసుపత్రిలోని డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. గ్రామానికి చెందిన 18మంది రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ స్టాఫ్‌నర్సు సుజాత పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామికి పల్లకీసేవ


శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీ సేవా కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో వైశాఖ మాసం సోమవారం సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నివాళి

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన జనార్దన్ (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి గ్రామానికి చేరుకుని సోమవారం జనార్దన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఊరూరా 'ఉపాధి'

- ఈ ఏడాది 1.60 లక్షల పనిదినాల లక్ష్యం
- రూ.7.70 కోట్లతో లేబర్ బడ్జెట్
- వ్యవసాయ పనులు ముగియడంతో ఊపందుకున్న పనులు
- రోజుకు 5000 మందికి గాను 3,215 కూలీల హాజరు


కాకరవాడ సమీపంలో కుంటలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు


కొండుపల్లె సమీపంలో కాల్వలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ : వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన వివిధ రకాల పనులను గ్రామ సభలు ఏర్పాటు చేసి ఇప్పటికే గుర్తించారు. మండలంలో 1.60 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం వేతనాలు, మెటీరియల్ ఖర్చులతో కలుపుకుని రూ.7.70 కోట్లతో లేబర్ బడ్జెట్ రూపొందించారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రోజు వారి కూలీలు 2,750 మంది పాల్గొన్నారు. మండలంలో 5,585 జాబ్‌కార్డులున్న కుటుంబాలున్నాయి. ఇందులో 9,940 మంది కూలీలున్నారు. ప్రభుత్వం రోజుకు 5,000 మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అయితే ఈ నెలలో రోజు వారి కూలీల సంఖ్య 3,215 మందికి చేరుకుంది. రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి శాఖ అధికారులు ఆమోదయోగ్యమైన పనులు గుర్తించారు. పొలాలకు వెళ్లే రస్తాల ఏర్పాటు, పంట కాలువలు, కుంటలు, చెరువుల్లో పూడికతీత పనులు ఉద్యాన వన పంటల సాగు కింద మామిడి, చీని, నిమ్మ, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, తదితర పండ్ల తోటలు సాగు, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

పెరిగిన కూలి..

గత ఏడాది గరిష్ట వేతనం రూ.272 వరకు చెల్లించేవారు. ప్రస్తుతం రూ.300 వరకు చెల్లిస్తున్నారు. నిర్దేశించిన కొలతల మేరకు పని చేస్తే గరిష్ట వేతనం లభిస్తుంది. అయితే పని ప్రదేశాల్లో ఉపాధి సిబ్బంది కొలతలతో పాటు సమయానుకూలంగా పని చేయిస్తూ పెంచిన కూలిలభించేలా కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గరిష్ట వేతనం పొందుతుండడంతోనే రోజు రోజుకు కూలీల సంఖ్య పెరుగుతోంది.

కూలి పెంచడం సంతోషంగా ఉంది



వ్యవసాయ పనులు లేకపోవడంతో కుటుంబ సభ్యులందరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. గత ఏడాది మా కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించారు. ప్రస్తుతం గ్రామ సమీపంలో కాలువలో పూడికతీత పనులు చేస్తున్నాం. రోజుకు గరిష్టంగా ప్రభుత్వం పెంచిన కూలి రూ. 300 అందుతుండం సంతోషంగా ఉంది. – యస్తారమ్మ, కూలీ, ఆర్.పాంపల్లె

కొలతల మేర పని చేస్తే గరిష్ట వేతనం



కూలీలకు గరిష్ఠంగా రోజుకు రూ. 300 వేతన లభిస్తుంది. రూ.272 నుంచి గత నెల ఈ మొత్తాన్ని ప్రభుత్వం రూ.300కు పెంచింది. అయితే వేసవి కాలం కావడంతో కూలీలు పని ప్రదేశానికి ఉదయం 6 గంటల్లోపు చేరుకుంటున్నారు. నిర్ణీత సమయం 5 గంటలు పైబడి, కొలతల ప్రకారం పనిచేస్తుండటంతో కూలీల ఖాతాల్లో గరిష్ట వేతనం జమవుతుంది. పండ్ల తోటలకు ప్రోత్సాహం ఇస్తూ ప్రభుత్వం మండలానికి వంద ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 60 ఎకరాల్లో రైతులు సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. ఎంపికైన రైతుల పేర్లు ప్రభుత్వానికి పంపాం. – రవిప్రకాష్, ఏపీఓ, ఉయ్యాలవాడ

23న కౌన్సెలింగ్

పగిడ్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23న కర్నూలు జగన్నాథ గట్టు దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ నిర్వహించిన ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా 1:3 నిష్పత్తి ప్రకారం మిగులు సీట్లు భర్తీ చేస్తారని స్పష్టం చేశారు. ఎస్సీ బాలికలు 70.25 శాతం మార్కుల నుంచి 15.25 శాతం మార్కుల వరకు, ఎస్టీ బాలికలు 56.25 శాతం మార్కుల నుంచి 13 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. బీసీ బాలికలు 84.75 శాతం నుంచి 45 శాతం, ఓసీ విద్యార్థినులు 79 శాతం నుంచి 41.25 శాతం మార్కులు సాధించిన వారు కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు. బీసీ, ఎస్టీ, ఓసీ విద్యార్థినులకు ఉదయం 8.30 గంటలకు, ఎస్సీ విద్యార్థినులకు ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

నేడు శ్రీ లక్ష్మీ,చెన్నకేశవస్వామి కల్యాణం

మిడుతూరు: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలయ ప్రాంగణంలో బుధవారం తెల్లవారుజామున 5.20 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటరమణ తెలిపారు. ఉదయం 8 గంటలకు శేష వాహనము, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నాడు- నేడు పనులు పూర్తి చేయండి


పనుల పురోగతిని వివరిస్తున్న ఎంఈఓ నాగార్జున రెడ్డి

శిరివెళ్ల: పాఠశాలలు తెరిచేలోగా మన బడి నాడు–నేడు పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎంఈఓ నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనుల పురోగతిపై హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించా. ఆయన మాట్లాడుతూ మండలంలో మన బడి నాడు– నేడు కింద 23 పాఠశాలలు ఎంపికయ్యారు. ఆయా పాఠశాలలో 70–75 శాతం పనులు పూర్తియయ్యాయని, పనుల పూర్తికి ఇటీవల ప్రభుత్వం రూ.1.64 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1.24 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. మిగిలిన నిధులతో పెండింగ్ పనులు పూర్తిచేయాలని సూచించారు. సిమెంట్ కొరతతో పనులు ఆగిపోయాయని హెచ్‌ఎంలు, సరఫరా చేస్తే పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఇంజినీర్ శంకరయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆదర్శం 'ఆంధ్ర కేసరి' జీవితం


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ప్రకాశం పంతులు నిరాడంబరత, నిస్వార్థం, దేశభక్తి, త్యాగం లాంటి ఆదర్శ గుణాలు నేటి తరానికి అవసరమని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మాతృ భాషా పరిరక్షణ సమితి సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయ సంఘ నేత వీరబ్రహ్మం ముఖ్య అతిథులుగా హాజరై ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, ముఖ్యమంత్రిగా ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి ఆంధ్ర కేసరిగా గుర్తింపు పొందరన్నారు. రఫీ, శ్రీనివాసరెడ్డి, శేషఫణి, బాలచంద్రుడు, నీలకంఠమాచారి, నీలం వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

గౌరవ వేతనం చెల్లించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 13వ తేదీన సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలింగ్ సిబ్బందికి ఒక రోజు గౌరవ వేతనం చెల్లించాలని, డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పీఓ, ఏపీఓ, ఓపీఓలకు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఒక రోజు గౌరవ వేతనం తక్కువగా చెల్లించారని, నాలుగు రోజుల ఎన్నికల విధులకు హాజరయ్యే వారందరికీ డ్యూటీ సర్టిఫికెట్ సంబంధిత అధికారుల ద్వారా ఇవ్వాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, గౌరవ వేతనంతో పాటు భోజనం అలవెన్స్‌ను ఎన్నికల కౌంటింగ్ తర్వాత తప్పక చెల్లిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. పుల్లయ్య, మునిస్వామి పాల్గొన్నారు.

జోరందుకున్న మూడో పంట కోతలు


కోటకొండ వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట


ఆలమూరు వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

రుద్రవరం: మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ గాలి వీస్తూ పొలాల్లో నీరు నిలిచేలా వర్షం కురుస్తుంది. పొలాలు పదునెక్కడంతో ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే కోటకొండ,రుద్రవరం,రెడ్డిపల్లె, నర్సాపురం,ఆలమూరు తదితర గ్రామాల పరిధిలో రబీ పంటలకు సంబంధించి కోతలు ఇంకా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా విడతల వారీగా సాగు నీరు అందించడంతో సాగు చేసిన మొక్కజొన్న,వరి,మినుము వంటి పంటలతో పాటు ఇతర పంటలు మంచి దిగుబడులు వచ్చాయి.వాటికి తగ్గట్టుగానే ధరలు మంచిగా ఉండటంతో రైతులు లాభాలు గడించారు. అంతే వెంటనే రెండో పంటగా తిరిగి వరి,మినుము,మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రెండో పంటలోనూ రైతులు లాభాలు చూడటంతో కొందరు రైతులు మూడో పంటగా బోరు మోటార్ల కింద అవే పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన కోతలు సాగుతున్నాయి. ధాన్యాన్ని విక్రయించుకుంటూ ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సిద్ధమవుతున్నారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు


స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకెళ్తున్న అధికారులు

శిరివెళ్ల: ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పది సప్లమెంటరీ పరీక్షలు మొదలు కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక మోడల్ స్కూల్‌ను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు. పరీక్షల చీఫ్‌గా యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా జయరాజు నియమితులయ్యారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రానికి తరలించారు. వివిధ సబ్జెక్ట్‌లలో ఫెయిలైన 671 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తెలుగు 111, హిందీ 76, ఇంగ్లిష్ 64, గణితం 123, ఫిజికల్ సైన్స్ 127, నాచురల్ సైన్స్ 167, సోషియల్‌లో 31 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మహానంది: మండలపరిధిలోని బుక్కాపురం పెట్రోల్ బంక్ వద్ద సోమవారం మహానంది వెళ్తున్న ఓ బైక్ ఎగిరిపడటంతో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంవల్లే ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నంద్యాల–మహానంది రహదారిలో అనుమతులు లేకుండా ఎవరి స్వార్థం కోసం వారు ఏర్పాటు చేసుకున్న స్పీడ్ బ్రేకర్ల ద్వారా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహానందిలోనూ కొందరు వ్యాపారులు, లాడ్జీల నిర్వాహకులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటి వలన పలువురు భక్తులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా అనధికారికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

కొత్తూరులో కలెక్టర్ సతీమణి పూజలు


కలెక్టర్ సతిమణి నళినికి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సతీమణి నళిని సోమవారం పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించుకున్నారు. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి దర్శనమనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ నాగలింగేశ్వరస్వామి వారికి పూజలు చేశారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరుడికి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేసి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.


దొర్నిపాడు : క్రిష్టిపాడు వద్ద కుందూలో ఉపశమనం పొందుతున్న గేదెలు


ఉయ్యాలవాడ వద్ద కుందూనదిలో సేదతీరుతున్న బర్రెలు

వేసవి తాపం తాళలేక..


ఉయ్యాలవాడ/దొర్నిపాడు : భానుడి ప్రచండ రూపానికి పశు పక్షాదులు బెంబేలెత్తుతున్నాయి. సోమవారం మండుతున్న ఎండ ధాటికి కాస్త ఉపశమనం పొందేందుకు పశువులు కుందూ నదిలో సేదతీరాయి. పశు పోషకులు మేత కోసం తీసుకెళ్లి ఎండ ఎక్కువగానున్న మధ్యాహ్న సమయంలో కుందూలో వదులుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి నదిలో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. నీటిలో పశువులు సేదతీరితే పాలు ఉత్పత్తులు కూడా పెరుగుతాయని పోషకులు పేర్కొంటున్నారు.

సంబరాలకు దూరంగా ఉండండి


నాయికులకు సూచనలు ఇస్తున్న సీఐ చంద్రబాబు

రుద్రవరం: ఎన్నికల ఫలితాలు త్వరలో వెలువడనున్నాయని, గెలుపు ఎవరిదైనప్పటికీ ఆయా పార్టీల నాయకులు ఆడంబరాలకు దూరంగా ఉండాలని శిరివెళ్ల సీఐ చంద్రబాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌లో చెదరు మొదరు ఘటనలు మినహా మండలం అంతా ప్రశాంతంగా సాగిందన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఈ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావడం, అక్కడ ఆధిక్యత తెలుసుకుంటూ ఈలలు,కేకలు వంటివి వేయొద్దని చెప్పారు. అక్కడ 144 సెక్షన్ అమలులో ఉంటుందని గుంపులుగా కనిపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే ఫలితాలు వెలువడగానే గ్రామాల్లో బాణసంచా వంటివి కాల్చకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నీలి మేఘం.. ఎరుపెక్కిన ఆకాశం..



సోమవారం సాయంత్రం.. క్రిష్టిపాడు గ్రామ సమీపంలోని కుందూ నది ఒడ్డున ఆవిష్కృతమైన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. భానుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం అరుణ వర్ణంలోకి మారిపోతుండగా.. ఒక్కసారిగా నీలి మేఘాలు సూర్యాస్తమయ దృశ్యాలను కమ్మేశాయి. అయినా అక్కడక్కడా నీలి, తెలుపు మేఘాల మాటున ఎరుపెక్కిన ఆకాశం కనిపించింది. ప్రకృతి గీసిన ఈ వర్ణచిత్రం ప్రకృతి ప్రేమికులను పరవశింపజేసింది. - దొర్నిపాడు

నన్ను ఉపయోగించుకోవచ్చుగా!


ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా జనరేటర్

విద్యుత్ లేని సమయంలో విధి నిర్వహణలో మీకు ఇబ్బందులు ఎదురు కాకూడదని కార్యాలయంలో నిరంతర సేవలు కొనసాగేందుకు నన్ను రూ.లక్షలు పోసి కొన్నారు. అయితే నన్ను పట్టించుకోకుండా పూర్తిగా విస్మరించారు. ఒక్కసారి విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు నా సేవలు మీరు గుర్తుకు తెచ్చుకుని కాస్త మరమ్మతులు చేయిస్తే మీ సేవలో తరిస్తాను... స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2016లో జనరేటర్ అమర్చారు. వినియోగానికి దూరమవడంతో నిరుపయోగంగా మారి తుప్పుపట్టిపోయింది. - ఉయ్యాలవాడ

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నంద్యాల(అర్బన్): నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే దుకాణదారులు రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. విత్తనం కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వకపోతే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని నందమూరినగర్ రోడ్డులోని శ్రీ అన్నదాత, రైతు మిత్ర ఏజెన్సీస్ దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, స్టాక్ బ్యాలెన్స్ తదితరాలను పరిశీలించారు. అనంతరం ఆయా ఏజెన్సీల్లోని విత్తన నమూనాలను హెచ్‌టీ పరీక్షలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు.